
సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



రూ.2 లక్షల విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి సుంకర లక్ష్మీసత్యనారాయణ, కుమారులు (రాజమహేంద్రవరం) ఆదివారం రూ.2 లక్షల విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం తూర్పు డెల్టాకు 2 వేలు, మధ్య డెల్టాకు 1,550, పశ్చిమ డెల్టాకు 3,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
40.0°/26.4°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	40.0	24.0
కాకినాడ	36.0	25.1
అమలాపురం	39.5	26.4

న్యూస్‌రీల్

అంబేడ్కర్ ఆలోచనలను భవిష్య తరాలకు అందించాలి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సమాజాభివృద్ధికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి, ఆలోచనలను మార్గదర్శకంగా తీసుకుని భవిష్యత్తు తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, అదే ఆయనకు మనం ఇచ్చే గొప్ప నివాళి అని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, డీఆర్‌ఓ నరసింహులు, ఇతర జిల్లా అధికారులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజావృద్ధికి, ప్రతి ఒక్కరికీ అన్ని హక్కులూ కల్పించే విధంగా అంబేడ్కర్ చక్కని రాజ్యాంగాన్ని రూపొందించారని అన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పని చేయాలి



పిఠాపురం నియోజకవర్గ ప్రజలతో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

కిర్లంపూడి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం పిలుపునిచ్చారు. పిఠాపురం నియోజకవర్గానికి చెందిన పద్మశాలి, ఆర్యవైశ్య సంఘాల నాయకులు, కార్యకర్తలు సుమారు 300 మంది ఆదివారం కిర్లంపూడి వచ్చి ముద్రగడను, యువ నాయకుడు గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ, 175 నియోజకవర్గాలకన్నా పిఠాపురంలో వైఎస్సార్ సీపీకి అత్యధిక ఓట్లు వచ్చేలా కృషి చేయాలని కోరారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతను, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ముద్రగడ నాయకత్వంలో వైఎస్సార్ సీపీ అఖండ మెజార్టీతో విజయం సాధించేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గణేశుల రాంబాబు, గణేశుల లచ్చబాబు, గౌతు స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు నేడు చివరి రోజు

కాకినాడ సిటీ: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించినంత వరకూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు సోమవారంతో గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో 18 ఏళ్లు నిండినా ఇంకా ఓటు హక్కు పొందని వారు, ఓటర్ల జాబితాలో పేరు లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. దీనికోసం ఫారం-6లో పూర్తి వివరాలు నింపి, అవసరమైన పత్రాలు జత చేసి, తహసీల్దార్ కార్యాలయాల్లో లేదా బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌ఓ) అందించాలి. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే జాబితాలో పేరు ఉండి ఇల్లు మారిన వారు తమ ఓటును ఇప్పుడున్న ప్రాంతంలోకి మార్చుకునే అవకాశం కూడా ఉంది. దీని కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను అధికారులు ఫిబ్రవరి 1న ప్రకటించారు. అర్హులైన వారికి మరో అవకాశం ఇచ్చేందుకు సోమవారం వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అనుబంధ ఓటర్ల జాబితాను ఈ నెల 25న ప్రకటిస్తారు.

లోవకు భక్తుల తాకిడి

తుని రూరల్: లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మండుటెండలోనూ వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చిన 9 వేల మంది భక్తులు తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారని ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,22,280, పూజా టికెట్లకు రూ.91,620, కేశఖండన శాలకు రూ.15,520, వాహన పూజలకు రూ.3,500, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలుగా రూ.61,412, విరాళాలు రూ.60,514 కలిపి మొత్తం రూ.3,54,846 ఆదాయం సమకూరిందని వివరించారు.

ఇదీ రాక్షసత్వం

- సీఎం జగన్‌పై హత్యాయత్నంపై సర్వత్రా ఆగ్రహం
- పలువురి నిరసన
- దురాగతానికి ఖండన
- చంద్రబాబు దుష్ట రాజకీయాలకు పాల్పడుతున్నారంటూ మండిపాటు

జనసంక్షేమ ప్రదాత, ఆంధ్రప్రదేశ్ ప్రగతి రథ సారథి ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రాష్ట్రం నడిబొడ్డున.. విజయవాడలో జరిగిన హత్యాయత్నంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. ఈ దురాగతాన్ని వైఎస్సార్ సీపీ నేతలతో పాటు సామాన్యులు సైతం తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్ చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు, బహిరంగ సభలకు వస్తున్న అశేష జనాదరణ చూసి ఓర్వలేకే చంద్రబాబు ఇటువంటి దుష్ట రాజకీయాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి రాక్షస చర్యలకు తావు లేదని నినదిస్తూ ఆదివారం పలు ప్రాంతాల్లో నిరసనలు తెలిపారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



మూల్యం చెల్లించుకోక తప్పదు



సంపత్ వినాయక ఆలయంలో పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



సీఎం జగన్ చిత్రపటానికి దిష్టి తీస్తున్న సత్తి ఆదిలక్ష్మి

అనపర్తి: సీఎం జగన్‌పై హత్యాయత్నం అమానుషమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఖండించారు. ముఖ్యమంత్రి క్షేమంగా ఉండాలని కోరుతూ విశాఖపట్నం పర్యటనలో ఉన్న ఆయన, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు చిన వాల్తేరు సాయిబాబా ఆలయం, ఆశీల్‌మెట్టలోని సంపత్ వినాయకస్వామి ఆలయాలతో పాటు పలు ఆలయాలను సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం ఘటన పిరికిపంద చర్య అని అభివర్ణించారు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర ద్వారా సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక.. ఎన్నికల రణరంగంలో రాజకీయంగా జగన్ మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేక.. టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల ప్రోద్బలంతో పక్కా వ్యూహం ప్రకారమే ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. నీచ రాజకీయాలు ప్రతిపక్ష నేతలకు అలవాటేనని, జగన్‌పై దాడిని కూడా వారు డ్రామాగా పేర్కొనడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ప్రతిపక్షాల తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, వైఎస్ జగన్‌ను ప్రజల నుంచి ఏ దుష్టశక్తులూ వేరు చేయలేవని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు.

ప్రజల ఆశీస్సులే శ్రీరామరక్ష

రాష్ట్ర ప్రజల ఆశీస్సులే సీఎం జగన్‌కు శ్రీరామరక్ష అని వైఎస్సార్ సీపీ నాయకురాలు, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ పార్టీ శ్రేణులు నల్లబ్యాడ్జీలతో అనపర్తిలో నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సీఎం జగన్ బస్సు యాత్రకు ప్రజలందరూ బ్రహ్మరథం పడుతుండడాన్ని జీర్ణించుకోలేక టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ కొంతమందిని ప్రేరేపించి వారితో ఈ దారుణానికి ఒడిగట్టారని ఆరోపించారు. మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, గతంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై తిరుపతిలో జరిగిన రాళ్ల దాడి, నేడు జగనన్నపై జరిగిన దాడి పచ్చ రౌడీ మూకల పనేనని అన్నారు. ఈ దాడి వెనుక ఉన్న సూత్రధారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జగనన్నపై ఉన్న దిష్టి తొలగిపోవాలంటూ సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి గుమ్మడికాయతో దిష్టి తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఏఎంసీ డైరెక్టర్ కోనాల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యర్నగూడెంలో నిరసన ప్రదర్శన



మంత్రి తానేటి వనిత ఆధ్వర్యాన యర్నగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

దేవరపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రతిపక్షాలు కుట్రపూర్వకంగా చేసిన దాడిని ఖండిస్తూ దేవరపల్లి మండలం యర్నగూడెంలో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత ఆధ్వర్యాన పార్టీ శ్రేణులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నల్ల రిబ్బన్లు ధరించి, టీడీపీ గూండాల అరాచక రాజకీయాలు నశించాలంటూ ప్లకార్డులతో క్యాంపు కార్యాలయం నుంచి పంచాయతీ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ, బస్సు యాత్రకు పెద్ద ఎత్తున ప్రజాదరణ లభిస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనలేక కావాలని కుట్రపూరితంగా దాడి చేయడం బాధాకరమన్నారు. సీఎంపై జరిగిన దాడిని మానవత్వంతో ఖండించాలి, కానీ వక్రీకరిస్తున్నారు. దండ కున్న తీగ గుచ్చుకుని గాయమైనట్లు కొంత మంది వక్రీకరిస్తున్నారని, తీగ గుచ్చుకుని గాయం అయితే వెనుక ఉన్న ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్‌కు గాయం ఎలా అయిందని ఆమె ప్రశ్నించారు. బస్సు యాత్రలో ముఖ్యమంత్రిపై భౌతికదాడులు చేయడం అమానుషమన్నారు. భద్రతా లోపం ఏమీ లేదని, ఇవ్వాల్సిన భద్రత కల్పించామని తెలిపారు. ప్రతిపక్షాలు దిగజారి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకులు వెళ్లినప్పుడు జనాలు ఉండడం లేదని, వాళ్లు ఇటువంటి ఏర్పాట్లు చేసుకుంటున్నారేమో అని అన్నారు. రాళ్ల దాడి కూడా కోడి కత్తి డ్రామాలా ఉందంటూ కొంత మంది వక్రీకరిస్తున్నారని, నోటికి వచ్చినట్టు మాట్లాడడం మంచిది కాదని మంత్రి వనిత హితవు పలికారు. ఇటువంటి దాడి ఎవరిపై జరిగినా తాము ఖండిస్తామని, దాడిపై విచారణ జరుగుతుందని, దోషులను విడిచిపెట్టేది లేదని, కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. ఇటువంటి నీచ రాజకీయాలు చేసేది టీడీపీ వాళ్లేనని ఆరోపించారు. ఎక్కడా జరగని భౌతిక దాడి టీడీపీ నాయకులు ఉమామహేశ్వరరావు నియోజకవర్గంలోనే ఎందుకు జరిగిందో అంతా అర్థం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. దాడిని తట్టుకుని నిలబడిన నాయకుడు జగనన్న అని అన్నారు. ఇదే దెబ్బ ప్రతిపక్ష నాయకులకు తగిలితే కుప్పకూలిపోయేవాడని చెప్పారు. దాడిని ఖండించాల్సిన బాధ్యత ప్రతిపక్షాలపై ఉందని మంత్రి వనిత అన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, జెడ్పీటీసీ సభ్యులు పొట్టి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ, దోసకాయలపల్లిల్లో నిరసన



కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



దోసకాయలపల్లిలో రోడ్డుపై బైఠాయించిన వైఎస్సార్ సీపీ నాయకులు

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నానికి నిరసనగా కోరుకొండ, దోసకాయలపల్లి గ్రామాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆందోళనలు నిర్వహించారు. బాబు అండ్ కో కుట్రలను ఖండించండి, దాడులను వ్యతిరేకించండి, ప్రజాస్వామ్యంలో దాడులా.. సిగ్గుచేటు అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో జరిగిన ఆందోళనలో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు మాట్లాడుతూ, కూటమి కుట్రపూరిత వైఖరితో ఉందని, సీఎం జగన్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు భౌతిక దాడులకు పురిగొల్పుతున్నారని మండిపడ్డారు. దాడికి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని ఎన్నికల కమిషన్‌ను ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కోరుకొండ మండలం మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, కోరుకొండ ఎంపీటీసీ కో ఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్, తిరుమలశెట్టి సత్యనారాయణ, తాడి హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి, కేతినీడి అశోక్ తదితరులు పాల్గొన్నారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు రోడ్డుపై బైఠాయించారు. సీఎం జగన్‌పై హత్యాయత్నాన్ని నిరసించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ, సీఎం జగన్‌పై పథకం ప్రకారమే భౌతిక దాడికి ఒడిగట్టారని ఆరోపించారు. దీనిపై లోతైన దర్యాప్తు చేసి, ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుట్రలు, కుతంత్రాలు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని విమర్శించారు. సీఎంపై దాడిని ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కడవల శివ, ఎంపీటీసీ బేదంపూడి పాప, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాదరణకు ఓర్వలేకే భౌతిక దాడులు



కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే టీడీపీ కుట్రపూరితంగా భౌతిక దాడులకు ఒడిగడుతోందని గోపాలపురం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీఎం జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనపై సమగ్ర విచారణ చేసి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజాదరణ కోల్పోవడంతో టీడీపీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. కూటమి కుట్రలో భాగంగానే ముఖ్యమంత్రిపై భౌతికదాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు తమ ప్రసంగాల్లో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని గుర్తు చేశారు. 'ఫ్యాన్‌పై రాళ్లు రువ్వండి' అని పిలుపునిచ్చిన తరుణంలోనే విజయవాడలో ముఖ్యమంత్రిపై దాడి జరగడం హేయమని అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపడం ఎవరి తరమూ కాదని ఎమ్మెల్యే వెంకట్రావు స్పష్టం చేశారు.

పథకం ప్రకారమే దాడి



బస్సు యాత్రలో ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూడలేకే సీఎం జగన్‌పై ప్రతిపక్ష నేత చంద్రబాబు పథకం ప్రకారం దాడి చేయించారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడినా రానున్న ఎన్నికల్లో సీఎం జగన్ చేతిలో ఓటమి తప్పదని భావించే రాళ్లతో కొట్టండి అంటూ పార్టీ కార్యకర్తలను చంద్రబాబు సభల్లో రెచ్చగొడుతున్నారన్నారు. ఓటమి భయంతోనే ఆయన హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారు. దీనికి చంద్రబాబు త్వరలోనే తగిన మూల్యం చెల్లించకోక తప్పదు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి 2019 కంటే అత్యధిక స్థానాలు గిఫ్ట్‌గా ఇచ్చి అధికార పీఠంపై కూర్చోబెట్టడం తథ్యం.

– ఆకుల వీర్రాజు, చైర్మన్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (రాజమహేంద్రవరం రూరల్)

కార్మికులకు ఈ–శ్రమ్ వరం

- యూఏఎన్ కార్డుల జారీ
- దేశంలో ఎక్కడైనా లబ్ధి పొందే అవకాశం
- పోర్టల్ ద్వారా ఉచితంగా నమోదు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా లబ్ది చేకూర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ–శ్రమ్ కార్డులు అసంఘటిత కార్మికులకు వరంగా మారనున్నాయి. ఈ కార్డులు పొందడం ద్వారా వారు సామాజిక భద్రతా చట్టం క్రింద సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతారు. వృత్తి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను అందించడానికి కూడా ఈ కార్డులు ఉపయోగపడతాయి. ఆర్థిక సహాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు.

కరోనా ఆపత్కాలంలో వలస కార్మికులు, అసంఘటిత కార్మికులు ఎదుర్కొన్న కష్టాలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో ఈ–శ్రమ్ పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. దీని ద్వారా అసంఘటిత కార్మికుల గుర్తింపునకు రంగం సిద్ధమైంది. ఆధార్ కార్డు తరహాలోనే దేశంలో ఎక్కడికి వెళ్లినా అసంఘటిత కార్మికులకు ప్రయోజనం చేకూరేలా యూనివర్సల్ అకౌంట్ నంబర్(యూఏఎన్)తో కూడిన ఈ–శ్రమ్ గుర్తింపు కార్డులు అందజేస్తున్నారు. దీనిపై క్షేత్ర స్థాయిలో కార్మిక శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో అనధికారికంగా 5,45,810 మందికి పైగా అసంఘటిత కార్మికులు ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకూ 3,18,014 మందికి గుర్తింపు కార్డులు ఇచ్చారు. ఒక్క రాజమహేంద్రవరం నగరంలోనే సుమారు 25 వేల మంది కార్మికులున్నారని అంచనా. వీరిలో ఇప్పటి వరకూ సుమారు 10 వేల మందికి పైగా ఈ–శ్రమ్ కార్డులు నమోదు చేయించుకున్నారు. జిల్లాలో కొన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఈ–శ్రమ్ కార్డుల నమోదుపై అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు.

వీరే అర్హులు

వయసు 16 నుంచి 59 ఏళ్ల వరకూ కలిగి, ఈఎస్ఐ, ఈపీఎఫ్‌కు అవకాశం లేని భవన నిర్మాణ, వలస కార్మికులు, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, మత్స్యకారులు, పశుపోషణలో నిమగ్నమైన వారు, బీడీ రోలింగ్, తోలు కార్మికులు, వడ్రంగి, ఉప్పు కార్మికులు, ఇటుక బట్టీలు, క్వారీ కార్మికులు, సామిల్లు, క్షురకులు, కూరగాయలు, పండ్ల విక్రేతలు, వార్తాపత్రిక విక్రేతలు, రిక్షా కార్మికులు, ఆటో డ్రైవర్లు, చర్మశుద్ధి కార్మికులు, వీధి వర్తకులు, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు తదితర అసంఘటిత కార్మికులు ఈ–శ్రమ్ కార్డు పొందేందుకు అర్హులు.

నమోదు ఇలా..

ఈ కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేసుకునేవారు ఎటువంటి రుసుం చెల్లించనక్కర్లేదు. కార్మికుని ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నంబరు (ఐఎఫ్ఎస్‌సీ కోడ్ సహా), బ్యాంకు, ఆధార్ కార్డుతో లింకేజీ కలిగిన ఫోన్ నంబర్ ఉండాలి. సమీప సీఎస్‌సీ సెంటర్లు, పోస్టాఫీస్, గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేస్తారు. కార్మిక శాఖ కార్యాలయాల్లో లేబర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి సహాయ సహకారాలు అందిస్తున్నారు.

పీఓ, ఏపీఓలకు నేడు శిక్షణ

- హాజరు కాని వారిపై కఠిన చర్యలు
- కలెక్టర్ మాధవీలత హెచ్చరిక

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నెల రోజుల వ్యవధిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే నియోజకవర్గాలకు సంబంధించిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌ల స్కానింగ్ ప్రక్రియను పూర్తి చేసి, తాత్కాలిక స్ట్రాంగ్ రూములకు తరలించారు. లాలాచెరువు వద్ద ఉన్న ఎఫ్‌సీఐ గోడౌన్లలోని జిల్లా సెంట్రలైజ్డ్ ఈవీఎం గోదాములో భద్రపరిచిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు, అనుబంధ యూనిట్లను ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూములకు శనివారం తరలించారు. అంతకు ముందు పార్లమెంటరీ నియోజకవర్గానికి కేటాయించిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను శుక్రవారం ఆయా నియోజకవర్గాల స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచి సీల్ చేశారు. దీనికి కొనసాగింపుగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ప్రిసైడింగ్ అధికారులకు (పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారులకు (ఏపీఓ) సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ తరగతులు జరుగుతాయి. దీనికి పక్కాగా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల విధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల విధులకు సంబంధించి ఎవ్వరికీ ఎటువంటి మినహాయింపులూ లేవని, ఉత్తర్వులు అందుకున్న ప్రతి ఒక్కరూ ఆయా నియోజకవర్గాల్లో జరిగే శిక్షణ తరగతులకు కచ్చితంగా హాజరు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. శిక్షణకు వచ్చే వారికి అన్ని సదుపాయాలూ కల్పించాలని సూచించారు. పోలింగ్ నాడు, ముందు రోజు చేయాల్సిన పనులపై సమగ్ర సమాచారం అందజేయాలన్నారు. పోస్టల్ ఓటింగ్ కోసం ప్రతి ఒక్కరూ 12డి ఫారం స్వీకరించాలని చెప్పారు. ఎన్నికల విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.



శిక్షణ తరగతుల ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్

శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న వేదికలు

నియోజకవర్గం	సెంటర్	పీఓ	ఏపీఓ	మొత్తం
రాజానగరం	బీవీసీ ఇంజినీరింగ్ కాలేజీ	368	370	738
కొవ్వూరు	దీప్తి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్	261	182	443
గోపాలపురం	డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల స్కూల్	198	204	402
రాజమహేంద్రవరం రూరల్	ఫ్యూచర్ కిడ్స్ స్కూల్	335	443	778
రాజమహేంద్రవరం సిటీ	ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల	490	351	841
అనపర్తి	ఎస్ఆర్‌జెడ్ బాలుర హైస్కూల్	147	185	332
నిడదవోలు	వికాస్ డిగ్రీ కళాశాల	229	235	464

క్లుప్తంగా

ముఖ్యమంత్రిపై దాడిపై ఆందోళన

భద్రతా బలగాలను పెంచాలని గవర్నర్‌కు వినతి

మండపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై శనివారం రాత్రి విజయవాడలో ఎన్నికల ప్రచార సభలో రాళ్లతో దాడి జరగడంపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు జరిగేటప్పుడు భౌతిక దాడులు చేయడం నీచమైన సంస్కృతి అని ఆయన అన్నారు. వెంటనే జగన్‌కు భద్రత పెంచాలని ఆయన కోరారు.

అగ్నిప్రమాదాలతో అప్రమత్తం

- జిల్లా అగ్నిమాపక అధికారి పార్థసారథి
- అగ్ని మాపక వారోత్సవాల ప్రారంభం



అగ్ని మాపక వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా అధికారి పార్థసారథి, అమలాపురం అధికారి కొండబాబు, సిబ్బంది

అమలాపురం టౌన్: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలను చాలా వరకూ అదుపు చేయవచ్చని జిల్లా అగ్నిమాపక, విపత్తుల స్పందన అధికారి ఎస్.పార్థసారథి జిల్లా ప్రజలకు సూచించారు. అమలాపురంలోని అగ్ని మాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలను పార్థసారథి ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అగ్ని ప్రమాదాల నివారణకు సూచనలు, జాగ్రత్తలతో ముద్రించిన కర పత్రాలను ఆవిష్కరించారు. అమలాపురం అగ్ని మాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్థసారథి మాట్లాడుతూ ఏటా ఏప్రిల్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు అగ్నిమాపక కేంద్రాల ద్వారా ఈ వారం రోజులూ జిల్లాలో పలు కూడళ్ల, అపార్ట్‌మెంట్ల వద్ద ప్రజలకు అవగాహన కల్పించి పలు పరికరాలతో ప్రయోగాత్మకంగా అగ్ని ప్రమాదాలను అదుపు చేసే విధానాలను వివరిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్మృతి పరేడ్ ద్వారా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తొలుత అగ్నిమాపక పతాకాన్ని ఆవిష్కరించారు. అమలాపురం కేంద్రం లీడింగ్ ఫైర్‌మెన్ మట్టపర్తి బలరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బకీ ఓ లెక్కుంది



- మూడు దశలు దాటాకే వడదెబ్బ
- ఈ విషయంపై ప్రజల్లో అవగాహన అవసరం
- ఆ దశకు చేరకుండా అప్రమత్తమవ్వాలి
- ఠారెత్తిస్తున్న ఎండలపై వైద్యుల సూచనలు



ప్రజలకు ఉచితంగా ఓఆర్ఎల్ ప్యాకెట్లు పంచుతున్న వైద్య సిబ్బంది

కాకినాడ క్రైం: ఎండలు ఠారెత్తిస్తున్నాయి. సాధారణంగా మే నెలలో కనిపించే తీవ్రత ఏప్రిల్ నెల తొలి వారం నుంచే మొదలైంది. ఉదయం 10వ గంట కొట్టినప్పటి నుంచే మండుటెండ విరుచుకుపడుతోంది. ఏసీలు, ఫ్యాన్ల కింద ఉద్యోగ వ్యవహారాలు చేసుకునే వారి స్థితి కొంత ఫర్వాలేదనిపించినా.. పొట్ట చేతపట్టి రోడ్లపై తిరిగి ఉద్యోగమో, వ్యాపారమో చేసుకునే వారి పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంటోంది. ఇటువంటి వారు ఎండ దెబ్బకి గురయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని అప్రమత్తం చేస్తూనే, అదే జరిగితే తక్షణమే తగిన సహాయం అందకపోతే ప్రాణాపాయమేనని హెచ్చరిస్తున్నారు. అయితే, వారి రోజువారి కార్యాకలాపాలపై అవగాహనతో ప్రతి వారు ఎండ ప్రభావానికి లోను కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బ తగలకుండా అవగాహన కలిగి ఉండాలంటున్నారు. వడదెబ్బ స్థితి అమాంతం సంభవించదని వివరిస్తూ వాటిలో దశలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆ వివరాలు మీ కోసం...

వడదెబ్బ అంటే...

తీవ్రమైన ఎండ, లేదా వడగాల్పుల ప్రభావం వల్ల ముక్కు, చెవి ఇతర శరీర మార్గాల ద్వారా వేడి శరీరంలో పలికి చేరి శరీర ఉష్ణోగ్రతను నెమ్మది నెమ్మదిగా పెంచేస్తుంది. ఈ స్థితిలో వేడి పెరగడం వల్ల కనీసం 103 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే ఎక్కువకు చేసి అవయవాల పనితీరుపై ప్రభావం చూపి విధ్వంసానికి సిద్ధమవుతుంది. ఈ స్థితిలో మనిషి కుప్పకూలి మరణం అంచుల వరకు వెళతాడు. తగిన సహాయం తక్షణమే అందకపోతే ప్రాణాలు కూడా కోల్పోవచ్చు. అయితే ఇది అమాంతం సంభవించేది కాదు. ఈ స్థితికి చేరడానికి కొన్ని దశలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

మూడు దశల్లో...

వడదెబ్బకు గురయ్యే వ్యక్తి తొలుత మూడు దశలకు లోనవుతాడు. ఈ దశలు కొనసాగుతుండగా ఏ మాత్రం అప్రమత్తమైనా ఆ వ్యక్తిని ఆ ప్రమాదం తప్పించవచ్చు. ఈ దశలకు వ్యక్తి ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలకు అనుగుణంగా హీట్ రాషెస్, హీట్ క్రాంప్స్, హీట్ ఎగ్జాషన్‌గా నామకరణం చేశారు. హీట్ ఎగ్జాషన్ వడదెబ్బకు చివరి స్థితి. చిట్ట చివరిది అయిన ఈ స్థితిలో కూడా వడదెబ్బకి గురి కాకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు.

ఎవరికి ప్రమాదం అంటే..

హీట్ ఎగ్జాషన్ దశ దాటితే వడదెబ్బ అనివార్యం అవుతుంది.

ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఎండల్లో తిరిగేవారు, మార్కెటింగ్, కూలి పనులు చేసే వారికి ఈ ప్రమాదం ఎక్కువ. వృద్ధులు, చిన్నపిల్లలు సైతం వడదెబ్బ ప్రమాదానికి లోనయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ముఖ్యంగా కిడ్నీ బాధితులు తగిన జాగ్రత్తలతో వ్యవహరించాలి.

ఏం జరుగుతుందంటే...

శరీర ధర్మశాస్త్రం ప్రకారం తనకేం కావాలో తనే అడగటం. అలసట అనిపిస్తే విశ్రాంతి, దాహం అనిపిస్తే నీరు, ఆకలి అనిపిస్తే ఆహారం, నొప్పి అనిపిస్తే ఉపశమనం కావాలనుకోవడం ఈ కోవలోకి వస్తాయి. సరిగ్గా ఈ శాస్త్రీయత పరిధిలోవే వడదెబ్బకు ముందరి దశలు. ఎండ దెబ్బకు గురవుతున్న వ్యక్తి తొలి దశలో దద్దుర్లు అనుభవిస్తాడు. ఇవి మెడ, తొడ, చంకలు, గజ్జులు, వీపు, ఛాతి ప్రదేశాలలో వస్తాయి. ఈ స్థితిని హీట్ రాషెస్ స్థితిగా పేర్కొంటారు. ఈ స్థితిని నిర్లక్ష్యం చేస్తే కండరాల నొప్పులు ప్రారంభం అవుతాయి. ఇవి సాధారణమైనవే అని చాలా మంది పారాసిటమాల్‌తో సరిపెడతారు. కానీ ఇవి ఎండ తీవ్రతకు లోనై, శరీరంలో నీటి నిల్వలు తగ్గిపోవడం వల్ల ఎదురయ్యే వడదెబ్బకు ముందర స్థితి. ఈ దశను హీట్ క్రాంప్స్ దశగా చెప్తారు. ఈ దశనూ నిర్లక్ష్యం చేస్తే, తీవ్రత పెరుగుతుంది. శరీరం విపరీతమైన అలసటకి గురికావడం, తల తిరగడం, కాళ్ల పిక్కల్లో విపరీతమైన నొప్పి, నోరు ఎండిపోవడం ఈ దశలో ఎదురయ్యే సమస్యలు ఈ దశను వైద్య పరిభాషలో హీట్ ఎగ్జాషన్‌గా పేర్కొంటారు.

కట్టుదిట్టంగా నివారణ చర్యలు



అత్యవసరం అయితే తప్ప ఎండలోకి రావద్దు. దశల వారీగా ఎండ దాడిని నిలువరిస్తూ వడదెబ్బ తగలకుండా జాగ్రత్త పడాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ విస్తారంగా చేపడుతున్నాం. స్థానిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో చలివేంద్రాలు లేదా మంచి నీటి ఏర్పాట్లకు ఇప్పటికే ఆదేశాలిచ్చాం. ఆర్టీసీ ఉద్యోగులు, రోజువారీ కూలీలు, సబ్ జైలు ఖైదీలు, అలాగే ఎండల్లో తిరిగే అవకాశం ఉన్న వివిధ వర్గాల ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రభుత్వం తరఫున ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. ప్రతి ఏఎన్ఎం, ఆశా కార్యకర్త వద్ద అత్యవసర పరిస్థితి కోసం ఈ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. వడదెబ్బ దశకు చేరకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా పాటను రూపొందించి అవగాహన కల్పిస్తున్నాం. సినిమా థియేటర్లలో ప్రత్యేక స్లైడ్‌లు వేస్తున్నాం. డూస్ అండ్ డోంట్స్ ప్రస్తావిస్తూ వడదెబ్బ నివారణ చర్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగుతోంది. – డాక్టర్ నరసింహ నాయక్, డీఎంహెచ్‌వో, కాకినాడ జిల్లా

ఇతర ఆరోగ్య సమస్యలపైనా..



ఎండ తీవ్రత వల్ల వడదెబ్బతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టే ఆస్కారం ఉంది. చర్మ వ్యాధులు, విరేచనాలు, హైగ్రేడ్ ఫీవర్లు ఈ సీజన్‌లో వచ్చే అనారోగ్యాల్లో కొన్ని.

ఎండాకాలంలో సాధారణం కంటే నీరు ఎక్కువగా తీసుకోవాలి. నీరు తక్కువగా తీసుకోవడం వల్ల యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్లు సంభవిస్తాయి. అధిక ఎండల వల్ల దాహం తాళలేక ఎక్కడపడితే అక్కడ నీరు తాగడం శ్రేయస్కరం కాదు. నీటి కాలుష్యం వల్ల టైఫాయిడ్ వంటి తీవ్ర అనారోగ్యాలు వాటిల్లుతాయి. ఎండాకాలంలో ఆరు బయట విక్రయించే కోసిన పండ్ల ముక్కల వల్ల ఆహార కాలుష్యానికి అవకాశం ఉంది. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ ఎం.శ్రీ శైలజారాణి, ఎంఎస్, జీజీహెచ్, కాకినాడ

ఘనంగా సత్యదేవుని రథోత్సవ సేవ



ఆలయ ప్రాకారంలో సాగుతున్న సత్యదేవుని రథోత్సవం

- రూ.2,500 చొప్పున టిక్కెట్లతో సేవలో పాల్గొన్న ఇద్దరు భక్తులు

అన్నవరం: రత్నగిరీశుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ దేవి అమ్మవారి రథోత్సవ సేవ ఆదివారం ఉదయం రత్నగిరి ఆలయ ప్రాకారంలో ఘనంగా జరిగింది. ఉదయం పది గంటలకు రథాన్ని తూర్పు రాజగోపురం ముందుకు తీసుకువచ్చి ఆ రథంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను ప్రతిష్ఠించి అర్చకులు పూజలు చేశారు. అనంతరం దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ కొబ్బరికాయ కొట్టి రథోత్సవం ప్రారంభించారు. తరువాత వేదపండితుల మంత్రాల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా ఆలయ ప్రాకారంలో మూడు సార్లు రథంతో ప్రదక్షిణ చేయించారు. అనంతరం మళ్లీ పండితులు పూజలు చేసి స్వామి, అమ్మవార్లను మేళతాళాల మధ్య ఆలయానికి తీసుకువెళ్లారు. వేదపండితులు యనమండ్ర శర్మ, రమేష్, ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యశర్మ, పరిచారకులు ముత్య వేంకటరావు పూజలు చేశారు. ఆలయ ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు, ఇతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సేవలో ఇద్దరు భక్తులు రూ.2,500 చొప్పున టిక్కెట్టు కొనుగోలు చేసి కుటుంబ సభ్యులతో సేవలో పాల్గొన్నారు. వీరికి స్వామివారి అంతరాలయ దర్శనంతో బాటు వేదాశీస్సులు అందచేశారు. స్వామివారి కండువా, జాకెట్టు ముక్క, ప్రసాదం అందజేశారు.

గూడాలలో అగ్నిప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న తాటాకు ఇళ్లు



బాధితులను పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్

నిరాశ్రయులైన మూడు కుటుంబాలు

అల్లవరం: మండలం గూడాలలో శనివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మూడు తాటాకు ఇళ్లు దగ్ధంతో పాటు ఒక భవనం పాక్షికంగా దెబ్బతింది. ఈ ప్రమాదవంలో మూడు కుటుంబాలు పూర్తిగా నిరాశ్రయమయ్యాయి. ఇంటిలో ఉన్న వారు గాఢ నిద్రలో ఉండగా ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పదిమంది ప్రాణాపాయం నుండి త్రుటిలో బయటపడ్డారు. ఇంటి పైకప్పు నుంచి మంటలు గమనించిన ఎనిమిదో తరగతి చదువుతున్న దొడ్డా రేవతి అందరినీ నిద్ర లేపి ప్రాణాలు కాపాడింది. మొదట ఆకుల మంగతాయారు (దివ్యాంగురాలు)కు చెందిన ఇంటి పైకప్పు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పక్కింట్లో నిద్రిస్తున్న దొడ్డా వెంకటేశ్వరరావు కుమార్తె రేవతి ఆ మంటలు గమనించి కేకలు వేసి అందరినీ లేపడంతో వారంతా బయటకు పరుగులు పెట్టారు. ఆకుల మంగతాయారు, ఆకుల వెంకటేశ్వరరావు, ఆకుల సత్యనారాయణల ఇళ్లు దగ్ధం కాగా, పక్కనే ఉన్న ఆకుల సత్తిబాబు డాబా ఇల్లు మంటల తీవ్రతకు పాక్షికంగా దెబ్బతింది. ఈ సమాచారం అందుకున్న అమలాపురం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే మంటలు పూర్తిగా వ్యాపించడంతో ఇళ్లల్లో ఉన్న ఐదు గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఒక సిలిండర్‌ను బయటకు లాగగలిగారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో బాధిత కుటుంబాలు ఊపిరి పీల్చుకున్నాయి. సీఐ పి.వీరబాబు ఎస్ఐ హరీష్ ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అందరిని నిద్రలేపి ప్రమాదం నుంచి తప్పించిన చిన్నారి రేవతిని అందరూ అభినందించారు. ఘటన స్థలాన్ని మంత్రి విశ్వరూప్ పరిశీలించి బాధితులను పరామర్శించారు. ప్రమాద బాధితులకు అమలాపురం మునిసిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నాని రాజు నిత్యావసరాలు అందించారు. ఎంపీపీ శేషగిరిరావు, సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ గౌతమి, మండల అధ్యక్షుడు కె.బాబూజీ, బీసీ సెల్ అధ్యక్షుడు యల్లమెల్లి బోసు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాతి శ్రీను, ఉప సర్పంచ్ ముత్తాబత్తుల సంతోష్ బాధితులకు రైస్ ప్యాకెట్లు, కాయగూరలు బట్టలు, కొంత నగదు అందించారు.

ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలి

- ఎస్ఈబీ అధికారులకు జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి ఆదేశం



ఐ.పోలవరం మండలం ఎదుర్లంక చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో ఎస్ఈబీ నిరంతర నిఘాతో అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఆ శాఖ విజయవాడ జాయింట్ కమిషనర్ టి.నాగలక్ష్మి జిల్లా అధికారులకు సూచించారు. జిల్లాలో రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో ఎస్ఈబీ ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో ఎన్నికలయ్యే వరకూ నిత్యం నిరంతర నిఘాతో వాహనాలు తనిఖీలు చేయాలని ఆదేశించారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆ శాఖ జిల్లా అధికారులతో ఆదివారం సాయంత్రం ఆమె సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకూ నిఘా, వాహనాల తనిఖీల ద్వారా సీజ్ చేసిన మద్యం, నగదు వివరాలు, నమోదైన కేసులను పరిశీలించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. నగదు, మద్యం, సారా, ఎన్నికల్లో పార్టీలు తాయిలాలుగా పంచే వస్తువుల స్వాధీన సమయంలో ఎన్నికల నిబంధనలను విధిగా అనుసరించాలని సూచించారు. జిల్లా ఎస్ఈబీ ఇన్‌చార్జి, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, ఎస్ఈబీ డీఎస్ఈవో కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తనిఖీలు పారదర్శకంగా చేస్తున్నట్టు వివరించారు. ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.అమరబాబు, సత్యనారాయణ, అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు, కొత్తపేట, ఆలమూరు, రామచంద్రపురం ఎస్ఈబీ సీఐలు, జిల్లా టాస్క్‌ఫోర్స్, ఇంటిలిజెన్స్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి పలు చెక్‌పోస్టుల పనితీరును తనిఖీ చేశారు.

ప్రజాభ్యుదయమే అరసం లక్ష్యం

- ఉద్ఘాటించిన సంఘం నాయకులు
- బండారులంకలో తొలి జిల్లా మహాసభ
- జిల్లా అధ్యక్షునిగా స్వామి ప్రసాద్ ఏకగ్రీవం



అధ్యక్షుడు స్వామి ప్రసాద్



ప్రధాన కార్యదర్శిగా నరసింహారావు



జిల్లా మహాసభలో సంఘీభావం తెలుపుతున్న కవులు, రచయితలు, సాహితీవేత్తలు తదితరులు

అమలాపురం రూరల్: సంఘ సంక్షేమమే సాహిత్య లక్ష్యం అయి ఉండాలని విశ్వ శ్రేయస్సుకు సాహిత్యం అంకితం కావాలని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. రూరల్ మండలం బండారులంక వీఎస్ఎం షాపింగ్ మాల్ వద్ద ఆదివారం సంఘం జిల్లా తొలి మహాసభ నిర్వహించారు. అరసం తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పడాల వీరభద్రరావు అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో కోనసీమ జిల్లాలోని కవులు, రచయితలు, సాహితీవేత్తలు హాజరయ్యారు. సంఘం కన్వీనర్ గండి స్వామి ప్రసాద్ అతిథులకు స్వాగతం పలికారు. అరసం రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సంఘం సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు డాక్టర్ చల్లా రవికుమార్, అరసం రాష్ట్ర కార్యదర్శి కె.శరత్‌చంద్ర జ్యోతిశ్రీ, రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జున సాగర్ మాట్లాడుతూ సాహిత్యం ప్రాధాన్యాన్ని వివరించారు. నేటి సామాజిక అంశాలపై కవితలు వినిపించిన జిల్లా కవులను నిర్వాహకులు సత్కరించారు. ఉమ్మడి జిల్లాలోని సాహిత్య చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. తొలుత మహనీయులు అంబేడ్కర్, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు. ప్రజలను మేల్కొలిపేందుకు సాహితీవేత్తలంతా ఐక్యంగా కృషి చేయాలన్నారు. సాంస్కృతిక పునరుజ్జీవనమే లక్ష్యంగా అరసం నూతన కమిటీ సభ్యులు ముందుకు సాగాలని కాంక్షించారు. సాహితీ సంఘాలు ఎన్ని ఉన్నా ప్రజాభ్యుదయ అంశాలతో పుస్తకాలను ప్రచురిస్తూ సభలు, సమావేశాలను నిర్వహించడంలో అరసం ముందున్నదన్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక..

జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గండి స్వామిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా జీవీఎల్ నరసింహారావు, గౌరవ అధ్యక్షులుగా ఊటకూరు సుబ్రమణ్య స్వామి, దాట్ల దేవదానం రాజు, చల్లా రవికుమార్, ఉపాధ్యక్షులుగా మాడా రాము, నేరేడుమిల్లి అబ్బులు, కార్యవర్గ సభ్యులుగా రాయుడు త్రినాథరావు, నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ, పినిపే సత్యనారాయణ, గొర్రెలరాము, కవి శ్రీ నాగేంద్ర స్వామి, కాజా మొహిద్దిన్ కొండేపూడి వినయ్ కుమార్, బి.సాంబమూర్తి, గిడ్డి ప్రకాశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై అపస్మారక స్థితిలో ఉన్న లోవరాజు

కరప: పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న ఒక జట్టుకూలీని లారీ ఢీకొట్టగా మరణించిన ఘటన కరప మండలం కరప, వలసపాకల గ్రామాల మధ్య చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం మేరకు మండలం వలసపాకల గ్రామానికి చెందిన వాసంశెట్టి లోవరాజు (35) కాకినాడ పోర్టులో మూటల పనిచేస్తుంటాడు. ఆదివారం పోర్టులో డ్యూటీ ముగించుకుని మోటార్‌సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా కరప శ్మశానవాటిక సమీపంలోకి వచ్చేసరికి రామచంద్రపురం వైపు నుంచి ఎదురుగా వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో లోవరాజుకు నుదుటిపైన, కుడికాలుపైన తీవ్రంగా రక్తపు గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లోవరాజు అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కరప ఎస్ఐ టి.రామకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని మరొకరు..



మృతుడు దున్నా రవీంద్ర(24)

నల్లజర్ల: మండలంలోని ఘంటావారిగూడెం శివారులో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం దున్నా రవీంద్ర (24) ఆదివారం స్నేహితులతో కలసి పొలం వెళ్లాడు. తల్లి ఫోన్ చేసి ఇంటికి రమ్మనడంతో బైపాస్‌పై బైక్‌పై వస్తున్న రవీంద్ర అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ సంఘటనలో రవీంద్రకు తీవ్ర గాయాలు కాగ అంబులెన్స్‌లో నల్లజర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తుండగా మృతిచెందాడు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.